అదరం.. బెదరం..

- ఖాళీ ప్లేట్లు, గరిటెలతో శబ్దం చేస్తూ వినూత్న నిరసన
- ఎర్రజెండా అండతో 15వ రోజు కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అంగన్వాడీల సమ్మెను భగ్నం చేసేలా ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తున్నా అదరం.. బెదరం.. అంటూ లక్ష్యసాధనలో అంగన్వాడీలు వీరోచింతంగా పోరాడుతున్నారు. జీతాలపెంపు విషయం తప్ప మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామంటే ఎలా మా ప్రధాన సమస్య జీతాలే.. అంటున్నారు. జీతాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు తగ్గేదేలే.. అంటూ అంగన్వాడీలు సాగిస్తున్న పోరాటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాసంగా మారింది. 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా 12ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీలు వీరోచితంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతలతో పాటు ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు అంగన్వాడీల పోరాటానికి మద్దతు ప్రకటిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొన్ని పోరాడుతున్న అంగన్వాడీల పోరాటం కార్మికవర్గానికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒక్క జీతాల పెంపేకాదు. ప్రమాదంలో ఉన్న ఐసీడిఎస్‌ను కాపాడుకొనేలా సేవ్ ఐడిసిడిఎస్ అంటూ సాగుతున్న పోరాటానికి లబ్దిదార్లు బాసటగా నిలుస్తున్నారు. చిత్తూరు జిల్లాలో పులిచెర్ల, జీడి నెల్లూరు మినహా అన్ని ప్రాజెక్టుల్లో సమ్మె కొనసాగుతోంది. జీడి నెల్లూరులో మూడురోజుల పాటు విధులను బహిష్కరించి సెమ్మలో పాల్గొన్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిళ్ళు, అధికార్ల బెదిరింపులతో అంగన్వాడీలు వెన్నకి తగ్గారు. మిగిలిన ప్రాజెక్టుల్లో విజయవంతంగా సమ్మె కొనసాగుతోంది. వినూత్న రీతిలో రోజుకో విధంగా ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమ్మెను కొనసాగిస్తున్నారు. అంగన్వాడీల పోరాటానికి రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటిస్తున్నారు. తమ న్యాయమైన కోరికపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిచేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్వాడీ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

చిత్తూరు, కార్వేటినగరంలో ఖాళీ ప్లేట్లు గరిటేలతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరింది. మంగళవారం కార్వేటినగరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఖాళీ ప్లేట్లు గరిటలతో శబ్దం చేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నదని ప్రశ్నించారు. నేటి నుంచి సమ్మె ఉధతరూపం దాల్చుతుందని గతంలోనే హెచ్చరించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగమొండిలాగా వ్యవహరిస్తుంటే అంతకంటే రెట్టింపు స్థాయిలో అంగన్వాడీలు పోరాటం చేయడంతో వారి పోరాటానికి రోజురోజు మద్దతు పెరుగుతున్నదని తెలిపారు. దీంతో గతంలో జరిపిన చర్చలు సందర్భంగా వేతనాలు, గ్రాట్యూటీ పెంచబోమని ఇంకా చర్చలు కూడా జరిపేది లేదని గంభీరంగా కూర్చున్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ఉధతం చూసి ఈరోజు మళ్లీ చర్చిలకు ఆహ్వానించడం స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే ఈ దఫా చర్చలోనైనా మొండిగా వ్యవహరించకుండా న్యాయమైన సమస్య, మీరు హామీ ఇచ్చిన సమస్యను వెంటనే పరిష్కారం చేసే దిశగా చర్చలలో ప్రకటించాలని ఆయన అన్నారు. చర్చలపేరుతో దాటవేస్తూ వస్తే సమ్మె ప్రజాఉద్యమంగా రూపుదాల్చుతుందని హెచ్చరించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. చర్చలు సఫలం కాకపోతే రేపు ప్రజాప్రతినిధులకు సామూహిక వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని, 28 నుండి 31 వరకు రిలేదీక్షలు కొనసాగుతాయని, జనవరి 3న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు మమత, యువరాణి, రాధా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంఘమిత్రల మద్దతు

ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో 15వ రోజు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల సంఘమిత్రలు శిబిరం వద్దకు వచ్చి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు శ్రీధర్, శేషాద్రిలు మాట్లాడుతూ అంగన్వాడీ, స్కీంవర్కర్లు సమస్యలన్నీ ఒకటేనని అందరూ ఐక్యంగా కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు.

యాదమరిలో..

పలమనేరులో..

చిత్తూరుఅర్బన్: జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. జిల్లాలో వినూత్న రీతిలో అంగన్వాడీలు ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరులో గిన్నెలు, పేట్లుతో శబ్దాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సృజని, బుజ్జి, ప్రేమ, ప్రభావతిలతో పాటు చిత్తూరు ప్రాజెక్టు పరిధిలోని చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాల అంగన్వాడీలు, సహాయకులు పాల్గొన్నారు.

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరింది. మంగళవారం యాదమరి మండల కేంద్రం తహాశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ ఖాళీ గిన్నెలతో శబ్దం చేస్తూ నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షకీలా మాట్లాడుతూ ఈనెల 28 నుండి 31 వరకు రిలేదీక్షలు కొనసాగుతాయని జనవరి 3న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

పలమనేరు: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియుల ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్‌రాజు, జ్యోతీశ్వర్, ఈశ్వర్ అంగన్వాడీల సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

7వ రోజు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు కోసం చేస్తున్న సమ్మె ఏడవ రోజుకు చేరింది. మంగళవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని ప్రారంభిస్తూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా కార్మికుల సమస్యలను త్వరితిగతిన పరిష్కరించి సమ్మె విరమింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అదనపు పనిభారం మానుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారు చేస్తున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఉద్యోగులు కార్మికులు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె ఉధతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ జేఏసీ నాయకులు శ్రీనివాసులు నారాయణ వేలువదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

యుటిఎఫ్ దశల వారి పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన వివిధ బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్సి, డిఎ, మెడికల్ రీయంబర్స్మెంట్, ఏపీ జిఎల్ఐ పిఎఫ్ సరెండర్ లీవ్ బకాయిలు రాష్ట్ర వ్యాపితంగా సుమారు 18వేల కోట్లు ఉన్నాయని ప్రభుత్వం తక్షణమే నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వంతో జరిగిన సమావేశంలో సెప్టెంబర్ నెలలో అన్ని బకాయిలను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ డిసెంబర్ నెల గడుస్తున్నా ప్రభుత్వం ఒక్క రూపాయిని కూడా విడుదల చేయలేదని అన్నారు. రాష్ట్రవ్యాపిత దశలవారి పోరాటాలకు యుటిఎఫ్ పిలుపునిచ్చిందని, ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి జిల్లా కలెక్టర్లకు ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యాలు చేయడం జరిగిందని ఇప్పుడు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా డిసెంబర్ 27 సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాత తాలూకా కేంద్రాలలో ఆరు గంటల నిరసన కార్యక్రమాలు జరపాలని యుటిఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపునిచ్చిందని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయకుంటే జనవరి 3వ తేదీన అన్ని జిల్లా కేద్రాలలో 12గంటల ధర్నాను, జనవరి 9,10వ తేదీలలో విజయవాడలో 36గంటల ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ దశల వారీ పోరాటం ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు టి.రఘుపతిరెడ్డి, సహాధ్యక్షులు రహనా బేగం, కోశాధికారి కె.ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శులు కె.రెడ్డెప్ప నాయుడు, ఏ.కష్ణమూర్తి, గాలి సురేష్, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్ మహేంద్రా, పంటపల్లి సురేష్, ఎం.పార్థసారథి, ఆడిట్ కమిటీ కన్వీనర్ పిసి.బాబు, రాష్ట్ర కౌన్సిర్లు సిఎ.ప్రకాష్, ఎస్‌పి.బాషా, టి.బాలాజీ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర.. నూతన క్రీడాచరిత్ర

- వంద కోట్లతో నిర్వహించే గొప్ప క్రీడాసంబరం
- క్రీడాకారులతో కళకళలాడిన మైదానాలు

ప్రెస్‌క్లబ్ సభ్యులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను రాష్ట్రస్థాయిలో ప్రారంభించడం జరిగిందని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మెసానికల్ గ్రౌండ్‌లో ఆడుదాం.. ఆంధ్ర క్రీడల ప్రారంభోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లాలో క్రీడాసంబరాలను మంత్రి పెద్దిరెడ్డి, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, చిత్తూరు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. నగర మేయర్ అముద, ఎస్పీ రిషాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సురేష్, జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు. క్రీడాపోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమం జ్యోతి ప్రజ్వలన, జాతీయ జెండా, ఆడుదాం ఆంధ్ర జెండాను ఆవిష్కరణతో కార్యక్రమం జరిగింది. జిల్లా తరపున ఆడుదాం ఆంధ్ర అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న కబడ్డీ పోటీలలో జాతీయ స్థాయిలో రాణించిన సదుం మండలంకు చెందిన డి.గుల్జార్, ఖోఖో లో జాతీయస్థాయిలో రాణించిన చిత్తూరు జిల్లా చెందిన ఎ.రాజ్ కుమార్, పవర్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించిన గుర్రంకొండ మండలంకు చెందిన కె.శ్రీలక్ష్మిలను, మంత్రి, కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత, విద్యార్థులు ఉత్సాహంగా క్రీడాసంబరాల్లో పాల్గొన్నాలని కోరారు. రాష్ట్రంలోని యువత క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు జిల్లాలో 612 సచివాలయ పరిధిలో ఈకార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. దాదాపు నెల రోజులు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రలో వివిధ క్రీడలకు సంబంధించి టీములను ఏర్పాటు చేయడం, ఆట మైదానాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. మేయర్ మాట్లాడుతూ యువత ఉత్సాహంగా పాల్గొనాలని, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో రాణించాలని తెలిపారు. జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, కమిషనర్ అరుణ, జిల్లాస్పోర్ట్స్ ఆఫీసర్ బాలాజీ, హౌసింగ్ డిఆర్‌డిఏ, డ్వామా పీడీలు పద్మనాభం, తులసి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు క్రికెట్ కిట్: ఆడుదాం.. ఆంధ్ర.. క్రీడాపోటీల్లో భాగంగా చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కిక్రెట్ కిటును అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో ఎంపిపి

నగరి: ఆడుదాం ఆంధ్ర.. నూతన క్రీడాచరిత్ర అని మంత్రి ఆర్కేరోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముడిపల్లి సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను ప్రారంభించారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకే ఈ క్రీడాసంబరాలన్నారు. ఎంపీడీవో లీలామాధవి, ప్రత్యేక అధికారి వాసు, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలో స్థానిక డిగ్రీకళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన ఆడుదాం ఆంధ్ర క్రీడలను మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను అందజేశారు. ఆర్డీవో సుజన, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైస్‌చైర్మన్లు వెంకటరత్నం రెడ్డి, సచివాలయ కన్వీనర్ దయానిధి, బాలన్ పాల్గొన్నారు.

సోమల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా కార్యక్రమాలను మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రజాప్రతినిధులు మండలస్థాయి అధికారులు వాలంటీర్లు వైద్య, ఆరోగ్య సిబ్బంది క్రీడాకారులు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.గ్రామస్థాయి నుండి క్రీడాకారులను ఎంపిక చేసి వారిలో దాగివున్న క్రీడలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. అనంతరం పలువురు క్రికెట్ క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య వైస్ ఎంపీపీ ప్రభాకర్ ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్ సర్పంచి రాజేశ్వరమ్మ, వ్యవసాయ సంచాలకులు శివకుమార్, తహసిల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి ఎంపీడీవో నాగరాజు వ్యవసాయ అధికారిసుధాకర్ ఎంఈఓ శివరత్న ఉపాధ్యాయులు కరుణానిధి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిరోజు ఒక్కొక్క క్రీడకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలను క్రీడాకారులుగా తయారు చేయాలని ఉద్దేశంతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను ప్రారంభించారు. రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్‌ఎంపీపీ సిరీస్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, సింగల్ విండో అధ్యక్షులు దత్తరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ నారే సోమశేఖర్, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈఓ రమేష్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించినట్లు ఒపీపీ లతబాలాజీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో కాగడా వెలిగించి బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఎంపిపి లతాబాలాజీ క్రికెట్ క్రీడాకారులతో పరిచయం చేసుకుని క్రికెట్ ఆడారు. ఎంపిడిఓ మోహన్ మురళీ, మండల ప్రత్యేక అధికారి త్రిశూల్, తహసీల్దార్ రవికుమార్, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, ఈవో పీఎస్ మణి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్ ఆవరణంలో స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య, తహశీల్దార్ బెన్నురాజు, ఎంపీపీ సరిత ఆధ్వర్యంలో జ్యోతి వెలిగించి, బ్యాండ్ మేళాలతో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మండలంలో 13 కేంద్రాల్లోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, ఆర్ఐ ప్రభాకర్, మాజీ సర్పంచ్ విజయబాబు, మండల కోఆప్షన్ నెంబర్ యేసురత్నం పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: పిల్లలు మొదలుకొని పెద్దల వరకు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ఎంపీపీ ఎ.అనిత అన్నారు. ఆడదాం.. ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు హైస్కూల్లో మంగళవారం మండల వైస్ ఎంపీపీ హరిబాబు, ఇన్చార్జి ఎంపీడీవో సుధాకర్, గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులు నేతలతో కలిసి ఎంపీపీ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు.

సదుం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి మంగళవారం సదుంలో విశేష స్పందన వచ్చిందని సదుం ఎంపిడిఓ వరప్రసాద్ అన్నారు. సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో జెడ్పిటిసి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిపి యల్లప్ప క్రీడలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మగారిపల్లిలో సింగల్ విండో వైస్‌చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్ రెడ్డి, కంభంవారిపల్లిలో మండల పార్టీ అధ్యక్షులు రెడ్డెప్ప రెడ్డి, వైస్‌ఎంపిపి ధనంజయరెడ్డి, చింతపర్తి వారిపల్లి సర్పంచ్ రామచంద్రయ్య, ఊటుపల్లిలో సర్పంచి చల్లా శ్రీనివాసులు రెడ్డి, రెడ్డివారిపల్లిలో సర్పంచ్ హనుమంత్ రెడ్డి, తిమ్మానాయునిపల్లిలో సర్పంచి మురళీరెడ్డి, జోగివారిపల్లిలో సర్పంచి అనితా ప్రకాష్ రెడ్డి క్రీడలు పోటీలను ఘనంగా నిర్వహించారు.

చౌడేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంను పుదిపట్ల ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ ఎన్.దామోదర్ రాజు, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, తహశీల్దార్ మాధవ రాజులు, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు.

బైరెడ్డిపల్లి: సచివాలయం పరిధిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంను రాష్ట్ర వైఎస్ఆర్సీపీ కార్యదర్శి క్రిష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డెప్ప ప్రారంభించారు. మండలంలోని 19 సచివాలయం పరిధిలో మంగళవారం ఉత్సాహంగా క్రీడాపోటలను నిర్వహించారు. ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, ఎంఆర్ఓ కుమారస్వామి, సెక్రెటరీ, విఆర్ఓ రాజేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో తహశీల్దార్ బెన్నురాజు

శాంతిపురం: క్రీడాపోటీలలో యువతను భాగస్వామ్యం చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని సచివాలయాల పరిధిలో ఆటలు ఆడటానికి నమోదు చేసుకున్న వారికి క్రీడాపోటీలను నిర్వహించారు. ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, జడ్పిటిసి శ్రీనివాసులు, కోఆప్షన్ నిసార్, మండల కన్వీనర్ దండపాని, ఎంపీడీవో హేమమాలిని పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక మున్సిపాలిటీ ప్రభుత్వ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్మన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దపంజాణి: ఆటల పోటీలు శరీరానికి మానసికల్లాసంతో పాటు శరీర దఢత్వంను ఇస్తాయని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. మంగళవారం ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని గవర్నమెంట్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు ఎంపీపీ ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, జడ్పిటిసి సుష్మాకీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్‌ఎంపీపీ జీడి బాబు, తహశీల్దార్ లోకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

చౌడేపల్లిలో..

సదుంలో..

లోపాలు లేకుండా సరుకులు పంపిణీ : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పౌరసరఫరాలకు సంబంధించి ఎండియూ ఆపరేటర్ల ద్వారా సరుకులు సరఫరా చేయించాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ డిఆర్ఓ, ఈఆర్వోలు, ఆర్డీవోలు, తహశీల్దారులు, వీఆర్వోలు ఇతర ఎన్నికలకు సంబంధించిన సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో అనుభవంలో ఉన్న వివిధ భూములకు సంబంధించి ఫ్రీ హెూల్డ్ రైట్స్‌కు అందిన దరఖాస్తులు విఆర్ఓ స్థాయిలో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కారం చేయాలని ఆర్డీఓలు ఈ విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. పౌరసరఫరాల వ్యవస్థకు సంబంధించి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంకా ఎవరైనా వాలంటరీగా దరఖాస్తు చేసి ఉంటే వారిని తీసుకొని వెంటనే ఈ వ్యవస్థలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎండియూ ఆపరేటర్ల పాయింట్లకు సంబంధించి అప్లోడ్ ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలనన్నారు. హంద్రీనీవా కాలువకు సంబంధించి భూమిని కోల్పోతున్న వారి కుటుంబాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని అటువంటి వారిని గుర్తించి కుప్పం పలమనేరు ఆర్డిఓ కార్యాలయాలకు తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. డిసెంబర్ నెల 9 వరకు ఎన్నికల ప్రక్రియలకు సంబంధించి ఓటర్ల మార్పులు చేర్పులు తీసివేతలకు సంబంధించిన ప్రక్రియను పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా నెట్వర్క్ సంబంధించి, ఎపిక్ కార్డులకు సంబంధించి, రూట్ ఆఫీసర్లకు సంబంధించి, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు సంబంధించి, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉద్యోగుల ప్రక్రియను పూర్తిచేయాలని నియోజకవర్గాల వారీగా నోట్స్ తయారు చేయాలని అన్నారు. క్యాంప్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్ఓ శంకరన్ పాల్గొన్నారు.

వాలంటీర్‌లపై వస్తున్న వార్తలు అవాస్తవం: డిఆర్ఓ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వాలంటీర్లపై వివిధ ప్రసార మాధ్యమాలల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం డిఆర్ఓ ఛాంబర్‌లో వాలంటీర్లు సమ్మెపై వాలంటీర్లు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారని తెలిఆపరు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్ల సమ్మె అంటూ వివిధ ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా, వార్తా పత్రికలలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవరమని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో పూర్తిగా సహకరిస్తామంటూ వాలంటీర్లు జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇవ్వడం జరిగిందని, దీని ద్వారా ఇతర జిల్లాల్లోని వాలంటీర్ల సందేహాలకు నివత్తి అవుతుందని అన్నారు. వాలంటీర్ల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుంటూ పరిష్కారం అందిస్తున్నదని తెలిపారని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వాలంటీర్లు పాలుపంచుకోవడం జరిగిందన్నారు. జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్షులు కె.వేణు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని వాలంటీర్లు 31 డిసెంబర్ నుండి సమ్మెలో వెళ్లనున్నారని వివిధ ప్రసార మాధ్యమాలల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, ఎటువంటి సమ్మెలో పాల్గొనడం లేదని, దీనిని ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావడం జరిగిందన్నారు.

'హంద్రీనీవా'కు జలహారతి

హంద్రీనీవా నీటికి జలహారతి ఇస్తున్న సర్పంచ్ జ్యోతి శ్రీనివాసులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామపంచాయతీ పరిధిలోకి చేరి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న గంగమ్మకు తీర్థం గ్రామసర్పంచ్ జ్యోతి శ్రీనివాసులు, ఎంపిటిసి రవీంద్రమ్మ కేశవులు కాలువలో పసుపు, కుంకమ, పూలతో పూజలు చేసి జలహారతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపిపి రెడ్డప్ప మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీటిని అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, రైతుల కష్టాలను చూసి హంద్రీనీవా కాలువలోకి నీరు రావడానికి సహకరించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కంటి అద్దాలు పంపిణీ

కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి బాలాజీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి వైద్యపరీక్ష నిర్వహించుకున్న వారికి ఉచిత కంటి అద్దాలను వైద్యాధికారి బాలాజీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పిహెచ్‌సి పరిధిలోని పెద్దఉప్పరపల్లి, ఆవులపల్లి, అన్నెమ్మగారిపల్లి పంచాయతీలలో 253మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగిందని వీరిలో ఇప్పటికే కొంతమందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం 61 మందికి కంటిఅద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. వైఎస్సార్ కంటివెలుగు ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని సర్పంచి భారతీ గణపతి అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చంద్రమ్మ, అమరావతి ఆరోగ్య కార్యకర్త, వరలక్ష్మీ, సుధారాణి, గంగులమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నుంచి చెన్నైకి

రైలు సౌకర్యం కల్పించాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా కేంద్రం నుండి చెన్నై వెళ్లేందుకు రైలు సౌకర్యం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ చిత్తూరు రైల్వేస్టేషన్ మేనేజర్ ముత్తుస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుంచి బస్టాండ్ వరకు రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. చిత్తూరు మీదుగా వెళ్లే పలు రైళ్లు ఆగి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్టేషన్ మేనేజరుకు విన్నవించారు. చిత్తూరు నుండి చెన్నైకి నిత్యం అనేక మంది వ్యాపార నిమిత్తం, ఆసుపత్రులకు, విద్యాభ్యాసం కోసం, ఉద్యోగం నిమిత్తం వెళ్లాలంటే తీవ్రఇబ్బందులు పడుతుంటారని తెలిపారు. కనుక మదనపల్లి, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా చెన్నైకి నూతన రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. పీసీసీ డెలిగేట్ ఏపీ.పరదేశి, రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ కార్మికులు గుర్తుకురా లేదా : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నేటికి 1150 రోజులుగా రిలేదీక్షలు చేస్తూ న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న టిటిడి అటవీ కార్మికుల సమస్య టిటిడి పాలకమండలికి పట్టదా? అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాలకమండలిని ప్రశ్నించారు. ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్ అయ్యారన్న సంతోషం వారిలో లేదన్నారు. బాధ్యతలు తీసుకున్న తరువాత అటవీ కార్మికులు జ్ఞప్తికి రాలేదా? అని ప్రశ్నించారు. కరుణాకర్‌రెడ్డి సభ్యులుగా ఉన్న పాలకమండలిలోనే 2019లో అటవీ కార్మికులకు టైంస్కేల్ ఇవ్వాలన్న నిర్ణయం జరిగిందని, అది అమలు కాకుండానే వారిని లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్‌లో బలవంతంగా చేర్చారని, ప్రస్తుతం దీక్షలు చేస్తున్న కార్మికుల కంటే జూనియర్లను పర్మినెంట్‌చేశారని విమర్శించారు. ఇంతటి అన్యాయం జరిగినా పాలకమండలికి, టిటిడి ఈవోకు అదేమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ధర్మాన్ని రక్షించండి.. ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రచారం చేసే టిటిడి యాజమాన్యం పాలకమండలిలో అటవీ శాఖకు జరిగిన అధర్మాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని కోరారు. టిటిడిలో కాంట్రాక్టు కార్మికులకు పెంచిన వేతనాలు ఇంకా అమలు కాలేదని గుర్తు చేశారు.

18 నుంచి 'సుస్థిర అభివృద్ధి' జాతీయ సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సుస్థిర అభివద్ది లక్ష్యాల జాతీయ సదస్సు కొన్ని రాష్ట్రాల్లో జరగనున్నదని అందులో మన రాష్టానికి చోటు లభించిందని, జనవరి 18 నుండి 20 వరకు తిరుపతిలో నిర్వహణకు జిల్లా యంత్రాంగం జిలా కలెక్టర్ వారి ఆదేశాలతో ఈ జాతీయ సదస్సు విజయవంతం చేయాలని పంచాయితీ రాజ్, రూరల్ డెవెలప్ మెంట్ కమిషనర్ సూర్యకుమారి అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తో కలసి పంచాయితీ రాజ్ రూరల్ డెవెలప్ మెంట్ కమిషనర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి సదస్సు నిర్వహణకు అన్నిరాష్ట్రాల నుండి దాదాపు 1000 మందికి పైగా డెలిగేట్స్ రానున్నారని, కేంద్ర రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు , అధికారులకు విధులు, లైజన్ ఆఫీసర్ల నియామకం కేటాయించాలని జిల్లా రెవెన్యూ అధికారి వారికి సూచించారు. జాతీయ సదస్సు నిర్వహణ కోసం శిల్పారామంలో అందుకు తగ్గ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని అన్నారు. ఆరోగ్యశాఖ, ఐసి డి ఎస్, విద్యాశాఖ, పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, డి ఆర్‌డిఎ శాఖలు తమ ప్రగతిని చూపే విధంగా స్టాల్స్ ఏర్పాటు, క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించాలని , రూట్ మ్యాప్ సిద్దం కావాలని సూచించారు. డిప్యూటి కమిషనర్ పి ఆర్ ఆనంద్, జిల్లా పరిషత్ సిఇ ఓ ప్రభాకర్ రెడ్డి, డిఆర్ ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

డిఎంకు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి- పుంగనూరు: ఏపీఎస్ ఆర్టీసీ పుంగనూరు డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ కోరారు. పుంగనూరు డిపో మేనేజర్ సుధాకర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు సర్కులర్ ప్రకారం కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదని చెప్పారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమౌంటు కార్మికుల ఖాతాలో జమ అవుతున్నది లేనిది తెలియడం లేదన్నారు. ఈఎస్ఐలో కుటుంబసభ్యులను చేర్చకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికులకు సంవత్సరానికి ఒకసారి పిఎఫ్ , ఈఎస్ఐ రసీదులు ఇవ్వాలని ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెరిగే డిఏతో కలసి చెల్లించవలసిన జీతం సర్కులర్ నోటీసుబోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్లీపింగ్, క్లీనింగ్ వారికి మెటీరియల్ కాంట్రాక్టర్ ఇచ్చే విధంగా చూడాలన్నారు. ప్రతినెలా పదో తేదీలోపు కార్మికులకు జీతాలు చెల్లించాలని ఈ సమస్యల పరిష్కారానికి కషి చేయాలని కోరారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి సంస్థ ద్వారానే కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు బాధ్యుడు మురళి పాల్గొన్నారు.

సురక్ష యోజన పథకం సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- యాదమరి: మాతత్వ సురక్ష యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి సురేఖ తెలిపారు. మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. మండలంలోని మోర్దానపల్లి సచివాలయం 180కొత్తపల్లి గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మొదటిసారి గర్భం దాల్చిన మహిళలకు చేయూతను అందించేందుకు ప్రధానమంత్రి మాతత్వ సురక్షయోజన పథకం కింద రూ.6వేలను అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చిన వారికి రూ.5వేలు నగదును సైతం అందిస్తున్నట్లు వివరించారు. అలాగే క్షయ వ్యాధి నిర్ధారణ వారికి ఆరు నెలల పాటు వెయ్యిరూపాయలు విలువైన మందులను ఉచితంగా అందించి వ్యాధి నయం చేస్తున్నట్లు వివరించారు. ఆయుర్వేదం డాక్టర్ తులసి, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్ పి.విష్ణుప్రియ, ఆశాలు శ్రీమతి, మునిలక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.

కార్మికులపై టిటిడి వరాల జల్లు

టిటిడి బోర్డులో పలు తీర్మానాలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఉద్యోగ కార్మికులపై వరాల జల్లు కురిపించింది. తిరుమల అన్నమయ్య భవన్‌లో ధర్మకర్తల మండలి సమావేశం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం జరిగింది. వేతనాల విషయంలో కల్యాణకట్ట క్షురకులకు, పోటు కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు మొత్తం దాదాపు 3వేల మందికి లబ్ది చేకూరనుంది. అలాగే గురువారం టిటిడి ఉద్యోగులకు ఇంటి స్థలాలను పంపిణీ చేయనున్నారు. మిగిలిన వారికి మరో 350 ఎకరాలు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ధర్మకర్తల మండలిలో తీసుకున్న నిర్ణయాలివే..

– తిరుమల కల్యాణకట్టలో పీస్‌రేట్ లెక్కన పనిచేస్తున్న క్షురకులకు ఊహించని విదంగా నెలకు రూ.20వేల రూపాయల కనీస వేతనం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 250 కుటుంబాలకు మేలు జరగనుంది.

– అలాగే శాశ్వత ఉద్యోగులు కాని పోటు కార్మికులకు రూ.10వేలు వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దాదాపు 350 కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. వాహన బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్‌గా గుర్తించి జీతాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

– టిటిడిలోని వివిధ విభాగాల్లో మిగిలిన కాంట్రాక్టు కార్మికుల జీతాలు కనీసం రూ.3వేలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 2వేల మంది కార్మికులు ప్రయోజనం పొందనున్నారు.

– అలాగే పెద్దజీయర్, చిన్నజీయర్ మఠాల నిర్వహణ, అక్కడి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడానికి పెద్దజీయర్ మఠానికి ఏటా రూ.60 లక్షలు, చిన్న జీయర్ మఠానికి ఏటా రూ.40 లక్షల అదనపు ఆర్థిక సాయం చేయాలని బోర్డు నిర్ణయం తీసుకుంది.

– టీటీడీ లోని ప్రతి ఉద్యోగికి, రిటైర్డ్ ఉద్యోగికి ఇంటి స్థలం ఇప్పించే బాధ్యత తనదని ప్రకటించిన ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి మాట నిలుపుకుంటున్నారు. ఎల్లుండి తొలి విడతగా 3518 మంది ఉద్యోగులకు మహతి ఆడిటోరియంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేయబోతున్నారు. మరో వారం పది రోజుల్లో ఇంకో 1500 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వానికి 80 కోట్ల రూపాయలు చెల్లించి మరో 350 ఎకరాల భూమి సేకరించి ఫిబ్రవరిలోపు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి టీటీడీ బోర్డు తీర్మానం చేసింది.

పోటు, వాహన బేరర్ల కృతజ్ఞతలు

పోటు కార్మికులకు 10 వేల జీతం పెంచుతూ మంగళవారం నిర్ణయం తీసుకోవడం పట్ల తిరుమల శ్రీవారి ఆలయ పోటు కార్మికులు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీవారి దర్శనానికి వెళ్ళిన ఛైర్మన్ ను పోటు కార్మికులు ఆలయంలో కలసి కతజ్ఞతలు తెలిపారు. తమకు ఒక్క సారిగా 10వేల జీతం పెరుగుతుందని కలలో కూడా ఊహించలేదని వారు సంతోషం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు కతజ్ఞతగా ఉంటాయని చెప్పారు. సుమారు 600 కుటుంబాలకు దీని వల్ల ప్రయోజనం కలిగిందని వారు చెప్పారు. అంతకు ముందు వాహనం బేరర్లు ఛైర్మన్ ను కలసి తమ అభ్యర్ధన మన్నించి తమను స్కిల్డ్ వర్కర్స్ గా గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే ఈ సహాయం చేస్తారని తాము ఊహించలేదని కతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీకి ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గోపినాథ్ 73వ జన్మదిన వేడుకలను ఆయన తనయుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూపేష్ గోపీనాథ్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులు పట్టణం బజారు వీధిలోగల వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం సంతపేట కూడలిలో గోపీనాథ్ చిత్రపటానికి ఇవాళ అర్పించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ కౌన్సిలర్లు చిట్టి, శ్రీనా, విజయ్, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ జునైద్ పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం

కుప్పం నియోజక వర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన భార్య దుర్గ భరత్ కోరారు. మంగళవారం రామకుప్పం మండల పరిధిలోని పిఎం తండా, పీఎంకే తండా పంచాయతీ లోనీ గ్రామాల్లో మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు సంక్రాంతి పండుగ కానుకగా పంపిణీ చేశారు. స్థానికంగా నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తీర్చి, అభివద్ధికి బాటలు వేస్తున్న తన భర్త భరత్‌కు ఆశీస్సులు అందించాలని ఆమె కోరారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ యశ్వంత్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్ నాగమ్మ చెంగప్ప, సర్పంచ్ బాబాజీ నాయక్, ఎంపీటీసీ భూషణ్ నాయక్ పాల్గొన్నారు.

నాణ్యతతో షాదీ మహల్ పనులు

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమల సమీపంలోని కందూరు రహదారిలో సబ్‌స్టేషన్ పక్కన నిర్మిస్తున్న షాదీమహల్ నిర్మాణ పనులను వేగవంతంగా చేస్తూ నాణ్యత ప్రమాణాలను పాటించాలని పంచాయతీరాజ్ జేఈ ఆనంద్ కోరారు. మంగళవారం మాజీ ఏఎంసి చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు ఇరువురు నిర్మాణ పనులను పరిశీలించి రూ.50లక్షల నిధులతో షాదీమహల్ నిర్మాణం జరుగుతోందని, ఇటీవల జడ్పీ నిధులు ఐదు లక్షల రూపాయలతో నూతన బోరు వేయడం జరిగిందిన, ఫిబ్రవరి 1వ తేదీ లోపు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. నాయకులు ఖాదర్బాషా, శెట్టివారి జగన్మోహన్ పాల్గొన్నారు.

దేశ భవితకు కమ్యూనిజమే శరణ్యం

తిరుపతి సిటీ : భారతదేశ భవితకు కమ్యూనిజమే శరణ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి .హరినాద్ రెడ్డి స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు తిరుపతి నగరంలో ఘనంగా జరిగాయి తిరుపతి జిల్లా సిపిఐ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాద్ రెడ్డి ఎగురవేశారు అనంతరం గంధమనేని శివయ్య కష్ణారెడ్డి మెమోరియల్ హాల్ నందు సిపిఐ 99 వ వార్షికోత్సవ కేకును కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సభకు జిల్లా విశ్వనాద్ అధ్యక్షత వహించారు.

జోనల్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా

నాగరాజకుప్పం జడ్పీహెచ్‌ఎస్

ప్రజాశక్తి- నగరి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగరాజు కుప్పంలో జరిగిన జోనల్ క్రీడల్లో స్పోర్ట్స్, గేమ్స్‌లో నాగరాజు కుప్పం జడ్పీహెచ్ఎస్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. అథ్లెటిక్స్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త ఆరూరు ఛాంపియన్షిప్ కైవసం చేసుకుంది. ఛాంపియన్ సాధించిన క్రీడాకారులను ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు కప్పులను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకేశవులు, సీనియర్ పీడీలు సురేష్, మణి, రాజేశ్వరి, సుబ్రహ్మణ్యం, గురప్ప, జ్ఞాన కుమార్, వేలు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు వితరణ

ప్రజాశక్తి- నగరి: స్థానిక జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మణివాసగం ఆర్వో ప్లాంటును వితరణగా అందించారు. మంగళవారం ప్లాంటును కోర్టు ఆవరణలో ఏర్పాటు చేయగా జడ్జి విష్ణువర్మ ప్లాంటును ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వేలాయుధం, కార్యదర్శి జాన్ జోష్, సహకార్యదర్శి కె.రాము, కోశాధికారి నాగరాజన్, సీనియర్ న్యాయవాదులు సుబ్రమణిరెడ్డి, ఏజీపి మురళి. ఉదయభాను, మురళీధర్, బాబు, ఇజి బాబు, ధరణి, అనిఫా. త్యాగరాజన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జెడ్పి ఛైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరులో జరిగిన జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొని, తిరుగు ప్రయాణంలో వి.కోటకు వెళుతున్న చిత్తూరు జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు నెర్నిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తించి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని అత్యవసర చికిత్స కొరకు అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్సు సకాలంలో రాకపోవడంతో గ్రామస్తుల సహకారంతో క్షతగాత్రుడిని తన కారులో ఎక్కించుకొని వి.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ వైద్యులకు సూచించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని సర్పంచ్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం కోగిలేరు రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ ధరలతో యూరియా పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఎరువులు విత్తనాలు కావలసి ఉంటే రైతులు మండల కేంద్రానికి వెళ్లే వారిని అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి సచివాలయానికి రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సబ్సిడీ ధరలతో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. రైతులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ పరందామ, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, సెరికల్చర్ అధికారి నరేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బిస్కెట్లు పంపిణీ

తిరుపతి టౌన్ : వంటవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా తిరుపతి భవానీనగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి నెలకు సరిపడా బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రాధారంగ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు వంగవీటి నరేంద్ర ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా రాధారంగ మిత్రమండలి అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. రంగా చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వి.జగన్నాధం, బాసికర్ల రఘు, డాక్టర్ కరుణానిధి పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో కాపునేత వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీలక్ష్మీనారాయణుడు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలోగల శ్రీలక్ష్మీ నారాయణుడు గరుడ వాహనపై అధిరోహించగా పలువురు భక్తులకు మంగళవారం దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో లక్ష్మీనారాయణలకు అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవ పూజలు నిర్వహించారు. మేనేజర్ వెంకటేశులు రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో ఉదయం 8 గంటలకు గుడ్డకొండను మంచు కప్పేసింది.. మధ్యాహ్నం ఒంటి గంటకు సూర్యకాంతలో మంచు తొలిగింది..